**కథ**

# ఒక గొంతు

**శౌఖమూరి శ్రీనివాస్**

సాయంకాలం. ఎంతో ప్రశాంతంగా, పక్షుల కిలకిలారావాలతో వాతావరణం ఆహ్లాదంగా వున్నా... నా మనసులో మాత్రం ఉదయం జరిగిన సంఘటన తాలూకు దృశ్యాలే మళ్ళీ మళ్ళీ కనిపిస్తున్నాయి. అందువల్లే పరిసరాలను పరిశీలించి ఆస్వాదించే స్థితిలో లేను. 'రివటలా ఉన్నవ్యక్తి ... ఎటువంటి ధన, కుల బలం లేనివాడు, అర్భకుడు... నూతిలోంచి వచ్చినట్లున్న మాటలు! అయితేనేం ... ఎంత సూటిగా, స్పష్టంగా ఉన్నాయవి!' ఒక్కసారి గతమంతా జ్ఞప్తికొచ్చింది.

***



ఆరోజు బడికి వెళ్ళగానే హడావుడి కనిపించింది. నలుగురైదుగురు కూలీలు ఫెన్సింగ్‌కు వేసిన సిమెంట్ స్తంభాలను పెళ్ళగిస్తున్నారు. రామిరెడ్డి, హెడ్‌మాస్టర్ పర్యవేక్షిస్తున్నారు. వారం క్రిందట విజిట్‌కు వచ్చిన యంఇవో చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. 'ఆదర్శ గ్రామం పథకం కింద మీ పాఠశాలకు అదనంగా రెండు తరగతి గదులొచ్చాయి. జాగ్రత్తగా దగ్గరుండి పూర్తిచేయించి, స్కూల్‌ను బాగా తయారుచేయండి'.

మాది ప్రాథమికోన్నత పాఠశాల. గత సంవత్సరమే అప్‌గ్రేడ్ అయింది. సర్వశిక్షా అభియాన్ పథకం ద్వారా ఇప్పటికే ఒక అదనపు గది మంజూరై పూర్తయింది. అదనంగా ఇప్పుడు రెండు! చాలా సంతోషమేసింది. ఇప్పటిదాకా ఒకేచోట రెండు తరగతులను కూర్చోబెట్టాలి. బోధన ఇబ్బందికరం. ఇవన్నీ పూర్తయితే మండలంలో ఇన్ని రూములున్న పాఠశాల మాదే అవుతుంది.

బైక్‌కు స్టాండేసి, రిజిస్టర్‌లో సంతకం పెట్టి బయటకు వచ్చాను. పిల్లల మనసంతా స్తంభాలు తీసేవాళ్ళపైనే ఉంది. వాళ్ళెలా పనిచేస్తారు? ఏం చేస్తారనేదే వాళ్ళ ఆసక్తంత! హెడ్‌మాస్టర్ దగ్గరికి వెళ్ళాను. కూలీలకు జాగ్రత్తలు చెబుతున్నాడాయన. 'ఓ జాగ్రత్త... స్తంభాలిరిగితే ఇబ్బంది.. రూములైనాక ఫెన్సింగ్ వెయ్యాలి'.

'నమస్తే సార్' అంటూ విష్ చేశాను. పక్కనే ఉన్నాడు రామిరెడ్డి. ఊరి పెద్దమనిషి! రూమ్‌ల కాంట్రాక్ట్ ఆయనకే వచ్చినట్లుంది. అతనే నన్ను పలకరించాడు. ప్రతిగా నవ్వాను.

"ఏం రామిరెడ్డి గారూ.. మీరేనా తీసుకుంది?"

"మనకే సార్..."

"స్పీడ్‌గా కానియ్యండి. ఇదిగో.. దీనిలాగా చెయ్యమాకండి" అంటూ స్లాబ్ పూర్తయిన సర్వశిక్షా అభియాన్ రూమ్‌ను చూపాను. దానికి ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ చేయలేదు. దాని కాంట్రాక్టర్ రామిరెడ్డి కాదు.

"మన ఎవారం అట్టుండదులే సార్.. ఏదైనా తెగిపోవాల! నాలుగు డబ్బులు మనకు రావడమో, జోబులోయి పడడమో.. రెణ్ణెల్లలో అయిపోతది సూడు."

మధ్యలో హెడ్‌మాస్టర్ కల్పించుకుంటూ, "అందరి పద్ధతీ వేరు, రామిరెడ్డిది వేరు సార్. వర్క్ దగ్గర పర్‌ఫెక్ట్! చూడు, దెబ్బకు అయిపోతది. ఓపెనింగ్‌కు ఎమ్మెల్యే, గిమ్మెల్యే... కథాకార్యాణం గందరగోళంగా ఉంటది

చూడు'' అన్నాడు.

రామిరెడ్డి ఛాతీ కాస్త ఉప్పొంగింది. కాంట్రాక్ట్ వర్క్ అనుకున్న సమయానికి పూర్తి చేస్తాడని అతనికి పేరు. అలాంటిది మా హెడ్‌మాస్టర్ పొగడ్తలు అతణ్ణి మరింత ఉత్తేజపరిచాయి.

''ఎమ్మెల్లేను పిలవకుండ ఉంటమా! మన మాట కాదంటడా!'' రామిరెడ్డి నవ్వుతూ అన్నాడు. తను, ఎమ్మెల్యే ఒకే పార్టీ. ఎమ్మెల్యే ఎప్పుడు ఈ ప్రాంతానికి వచ్చినా భుజంపై చేయి వేసి మాట్లాడే వ్యక్తుల్లో రామిరెడ్డి ఒకడు.

''ఇంతకీ స్థలం ఎక్కడ డిసైడ్ చేశారు సార్?'' హెడ్‌మాస్టర్ నడిగాడు.

''ఇదిగో ఇదే సార్...'' ఫెన్సింగ్ బయటి స్థలాన్ని చూపుతూ చెప్పాడాయన.

''రెండు రూములంటే.. ఇక్కడొకటి, అక్కడొకటా?'' అంటూ ఫెన్సింగ్ బయట ఉన్న వందేళ్ళ నాటి వేపచెట్టుకు రెండువైపులా చూపుతూ అడిగాను.

''ఊహూ... చెట్టు, దానిక్రింది ఈ అరుగు అంతా తీసెయ్యాలి సార్'' హెడ్‌మాస్టర్ మాటల్ని రిపీట్ చేస్తూ, ''సెట్టును లేపుతనె గాని రూములుబడవు. రూములు ఇడిగిడిగ కావు... రెండింటికీ జాయింట్ గోడ ఉండాలంట!'' రామిరెడ్డి వివరణ ఇచ్చాడు.

అంతటితో ఆ సంభాషణ పూర్తయింది. కూలీలు స్తంభాలు పీకడంలో నిమగ్నమయ్యారు. ఫోన్ రావడంతో లోడ్ అవుతున్న బొప్పాయి లారీల దగ్గరికి వెళ్ళాడు రామిరెడ్డి. హెడ్‌మాస్టర్, నేను మా తరగతుల్లోకి వెళ్ళాము.

మరుసటిరోజు వచ్చాడు రామిరెడ్డి. తన వెనకాల గొడ్డళ్ళతో ఉన్న ఐదుమంది కూలీలు. వాళ్ళతో బాటు పొట్టిగా ఉండి తెల్లచొక్కా, పంచెగట్టిన వడ్రంగి ఆచారి. ఈరోజు ఎలాగైనా ఆ చెట్టును మొదలువరకు తెగనరకాలన్న కసి కనబడింది వారి కళ్ళల్లో.

''ఏం రామిరెడ్డి గారు... చెట్టు కొట్టకుండా కుదరదా?'' దింపుడు కళ్ళం ఆశతో అడిగాను నేను.

''మీరు బలే సెబుతరు సార్... రెండు బిల్డింగులు ఏడ బడతయొ సూపండి. ఆడ్నే కడదాం! ఈ అరుగుకు, సెట్టుకు టైమైపోయిందిలే సార్..''

రామిరెడ్డికి పని త్వరగా ముగించాలని ఉంది. ఆలస్యమైతే తన ఖర్చు పెరిగి చేతి డబ్బులు పడతాయనేది అతని బాధ. రాకరాక ఊరికి స్కూల్ బిల్డింగులు వస్తే, నేనేదో అడ్డంపడ్డట్లు ముఖం పెట్టాడు రామిరెడ్డి. గుమిగూడిన కొద్దిమంది గ్రామస్తులు కూడా రామిరెడ్డి మాటలకు వంతపలికారు.

చెట్టును వేళ్ళతో సహా తీయడం, తరలించి కలప‌ను తీసుకోవడం ఆచారికి కాంట్రాక్ట్ అప్పగించారు. కూలీలను ఆచారే పిలుచుకుని వచ్చాడు. వచ్చిన కూలీలంతా శత్రువు చుట్టూ పొజిషన్ తీసుకున్న సైనికుల్లా చెట్టుచుట్టూ చేరారు. మా మాటలు ఎవరూ పట్టించుకోరని తేలిపోయింది. ఏం మాట్లాడాలో తెలియలేదు.

మనసులో బాధ! సుమారు వంద సంవత్సరాల వయసున్న చెట్టది! ఎంతోమంది ఆ చెట్టుకింది అరుగుపై ఆదమరచి నిద్రపోయి ఉంటారు. ఎన్ని పక్షులు ఎండకు, వానకు, చలికి ఆకుల మధ్య ఆశ్రయం పొందాయో! అది వదిలే ఆక్సిజన్, పర్యావరణ సమతుల్యత... ఎన్ని గుర్తుకొస్తే ఏం లాభం? దాని ప్రాణాన్ని కాపాడలేకపోతున్నాను కదా!

నా ఆలోచనలకు బ్రేక్ పడుతూ చెట్టు మొదట్లో 'ఫట్'మంటూ కొబ్బరికాయ పగిలింది. ఆచారి కళ్ళు మూసుకుని చెట్టుకు దండం పెడుతున్నాడు. బహుశా క్షమించమనేమో!

క్షమించమని ఎందుకడుగుతాడు? వృత్తిధర్మంగా చెట్టు బాగా చేవతో ఉండాలని కోరి ఉంటాడు. అతని పూజ అయిపోగానే గొడ్డళ్ళను భుజాలకు తగిలించుకుని కూలీలంతా చెట్టెక్కారు. ముందుగా చిన్నచిన్న కొమ్మల్ని నరికేయసాగారు. గొడ్డళ్ళ శబ్దాలు, పిట్టల్లా ఎగిరిపడుతోన్న పేళ్ళు బడిలో పిల్లలకు వినోదాన్ని పంచుతున్నాయి. అందరి దృష్టి చెట్టుపైనే ఉంది. యథాలాపంగా తరగతి గదిలో కూర్చుని ఉన్నారు అంతే!

ఇంటర్వెల్ ... ఎప్పుడెప్పుడు నరుకుతున్న చెట్టును చూద్దామా అన్న తొందరలో నెట్టుకోవడం, తోసుకోవడం, కిందపడడం... మధ్యలో మా బెత్తం దెబ్బలు! మొత్తానికి పిల్లలంతా చెట్టుకు కాస్త దూరంలో గుమిగూడారు. అప్పటికే చెట్టు తన ఆకారాన్ని చాలావరకు కోల్పోయింది. ఇక పెద్ద కొమ్మలు మిగిలాయి. వాటిని నరికేస్తే క్రింద ఉన్న అరుగు బండలు పగులుతాయని ఆపారు.

ఇక అరుగు అస్తిత్వాన్ని ఆవిరి చేసే కార్యక్రమం మొదలు.. గునపాలతో అరుగు మీది బండల్ని పెళ్ళగించి పక్కన పెట్టారు. ఇటుకలు, గచ్చుతో అక్కడక్కడా రంధ్రాలతో ఉన్న అరుగు అరగంటలో సగం శిథిలమైంది. చెట్టు మొదలు చుట్టు మాత్రమే మిగిలింది.

మధ్యాహ్నమైంది. కూలీలంతా భోంచేయడానికి వెళ్ళారు. పిల్లలు కూడా మధ్యాహ్న భోజనం చేశారు. అది కూడా ఎంతో హడావుడిగా! పళ్ళాలు కడిగిన వెంటనే చెట్టు వద్దకు పరుగులు... శిథిలాల పరిశీలన! కొంతమంది చెట్టెక్కారు. చెట్టు పిల్లల్ని చివరిసారి ఆప్యాయంగా స్పృశించినట్లుంది.

ఓ గంటయ్యాక గొడ్డళ్ళ చప్పుడు మళ్ళీ మొదలైంది. సాయంకాలం బడి ముగిసే సమయానికి కొమ్మలన్నీ నేలరాలాయి. ఇక మిగిలింది చెట్టు మొదలే! రామిరెడ్డి వచ్చి చూశాడు. ''ఓ ఆచారీ... రేపటికైద్దా... రెండు మూడు రోజులు నానబెడతావా?'' అని అడిగాడు.

''పొక్కిలేరు పెట్టినా రోజులు బడతదా... రేపు ఈయలకు మట్టంగైతది సూడు'' ఆచారి ధీమాగా చెప్పాడు.

***


మరుసటిరోజు... బడి ప్రారంభమై అర్ధగంటైంది. జె.సి.బిని పిల్చుకొచ్చిన ఆచారి దాని డ్రైవర్‌కు ఏం చేయాలో వివరిస్తున్నాడు. దాని శబ్దం విన్నది తరువాయి... బయట కూర్చున్న పిల్లలకు పలకలు, పుస్తకాల మీద మనసు నిలవలేదు. అదేం చేస్తుందో చూడాలన్న తాపత్రయం. అంత నారీ వాహనం తన ఇనుప చేతులతో మట్టి ఎత్తిస్తున్నా, కంప చెట్లను పెళ్ళగిస్తున్నా చూసేందుకు విచిత్రంగానే ఉంటుంది.


జె.సి.బి. కార్యరంగంలోకి దిగింది. ఆచారి టైం చూసుకున్నాడు. గంటకు ఆరొందలు అద్దె! అందుకే ఏమాత్రం ఆలస్యం చేయనీయకుండా, గంటలోనే పనంతా పూర్తిచేయించి పంపాలని ఆచారి ఆత్రుత. పిల్లలిక మా మాటలు వినే స్థితిలో లేరు.

మా కేకలు విన్నా, జె.సి.బి. చేసే శబ్దంతో వినబడనట్లే కొందరు నటిస్తున్నారు. అది పని చేస్తుంటే పెద్దలే కళ్ళప్పగించి చూస్తారు. ఇక పిల్లలకు ఇంకెంత వినోదమో!

జె.సి.బి. తన చేతిని చాచి అరుగు ఆనవాళ్ళను నేలమట్టం చేసింది. అరుగు లేక, కొమ్మలు లేక మిగిలిన చెట్టు మొదలు – కుటుంబ సభ్యులు, స్నేహితులు లేని ఒంటరి పక్షిలా నిలుచున్నట్లుంది. ఇక తనకూ బ్రతుకుతానన్న ఆశైతే లేదు. చావును ఆహ్వానించాలన్న ధీరత్వం చెట్టులో కనిపించింది.

ప్రొక్లెయిన్ తన రాక్షస హస్తంతో చెట్టు చుట్టూ గుంట తీసింది. అందులో చిన్నవి, పెద్దవి... రకరకాల పరిమాణాల పేర్ల ఆనవాళ్ళు కనిపించాయి. ఇంజన్ ఆపమన్నట్లుగా డ్రైవర్‌కు ఆచారి సైగ చేశాడు. అతను ఆపాక, ''ఇదిగో, ఈ పక్క పెద్దేరుంది. దాన్ని తెంపి, ఈ పక్కనే చెట్టును దొర్లియ్యాల'' సూచనలిచ్చి పని మొదలుపెట్టించాడు ఆచారి. ఆచారి చూపిన చోట ఓ పెద్ద వేరు చెట్టు కొమ్మంత ఉంది. తన ఇనుప గోర్లతో ఆ పెద్దేరు






ఒంటిని చీలికలు పీలికలు చేసి తెంపేశాక, చెట్టును నెట్టడం ప్రారంభించింది ఇనుప హస్తం.

ఒకటి రెండు తోపులకు కాస్త కదిలినట్లయింది. ఇంకో నాలుగుసార్లు ఢీ కొట్టేసరికి ఫెళఫెళమంటూ విరిగిపడింది వేపచెట్టు. పిల్లలు 'హే..' అంటూ కేరింతలు. విధ్వంసాన్ని, నిర్మాణాన్ని ఒకే దృష్టితో చూసే వయసు వాళ్ళది.

నేల రాలిన ఆ చెట్టు విగతజీవుడైన మహాకాయుడిలా ఉంది. కళ్ళముందే ప్రాణం కోల్పోయిన మనిషిలా కనిపిస్తోంది. అభివృద్ధి పేరు చెప్పి ఎంత అన్యాయానికి పాల్పడుతున్నాము. ప్రత్యామ్నాయాలు ఆలోచించకుండానే విధ్వంసమే నిర్మాణానికి ప్రాతిపదిక అని గుడ్డిగా నమ్ముతున్నాము. ఎంత బాధపడ్డా ఏం ఉపయోగం అనిపించింది. మనం చెప్పేది ఆలకించేవాళ్ళుంటే మార్చగలమన్న ఆశ ఉంటుంది. అలాంటి పరిస్థితులు కనిపించట్లేదు. మరి విధ్వంసాలను, పర్యావరణ అకృత్యాలను చూస్తూ కూడా తల దించుకుపోవల్సిందేనా? ఎవరినీ మార్చలేమన్న నిరాశతో జీవితాన్ని నెట్టుకుపోవాల్సిందేనా? ఆలోచనల సుడులు నన్ను స్థిరంగా ఉండనీయలేదు.

'సార్ పాము... పాము సా...' అన్న పిల్లల కేకలతో ఆలోచనలు ఆగాయి.

'యాడ్రా.. ఏది?' అంటూ పిల్లలు వేళ్ళు పెట్టి చూపిన వైపు చూశాను. అరమీటర్ ఉంటుందేమో! ఇప్పటివరకూ అరుగు నెర్రెల్లో ఎక్కడో ప్రశాంతంగా ఉన్నట్లుంది. ఎటుపోవాలో దానికర్థం కావట్లేదు. శవంపైనబడి రోదించే రక్త సంబంధీకురాలిలా చెట్టు మొదలు మీద పొరాడుతోంది.

మధ్యాహ్న భోజనం వండేవాళ్ళు తెచ్చిపెట్టిన కర్రల్లోంచి ఓ మూరెడు పొడవు కర్రను లాగి 'ఫట్' మంటూ కొట్టాడు రామిరెడ్డి. ఒకటే దెబ్బ! తలపైన టన్ను బరువు పడ్డట్టయి పామిక కిక్కురుమనలేదు. చూస్తున్న అందరి మొహాల్లోనూ ఆనందం, విషప్పురుగు అంతమైంది.

'ఇన్నాళ్ళూ అరుగు క్రిందే ఉన్నా, ఎవరికీ హాని చేయలేదన్న' మాట ఎవరి నోట్లోంచి బయటకు రాలేదు. బహిరంగంగా కన్పించి ప్రాణాలు పోగొట్టుకుందా సర్పం.

''ఓ ఆచారీ... ఈ మొద్దు తొందరగా తీపియ్యాల. సదరం జేసి పని మొదలు పెట్టొద్దు.''

రామిరెడ్డి తొందర చూసి ... ''రెండ్రోజులు ఓపిక బట్టు సామీ... సుబ్రంగా పుల్ల లేకుండా జేస్త. పనోళ్ళు రేపొస్తరు... కోపిచ్చి తీసేపిస్తలే'' ఆచారి నమ్మకంగా చెప్పాడు.

మరుసటిరోజు పాఠశాలకు వచ్చేసరికల్లా పిల్లలంతా హడావుడిగా వున్నారు. 'సార్... సార్... మేక పిల్ల జచ్చింది. చెట్టుపడ్డది సార్... చచ్చినదాన్ని పొరేసిన్రు సా... పొద్దున జూసేసరికే సచ్చిపోయుంది...' వాళ్ళ మాటలు నాకేం అర్థం కాలేదు.

'ఒక్కరు చెప్పండిరా..' అంటూ వేలు చూపి ఒకర్ని మాట్లాడమన్నాను.

''సార్... రేత్రి వానబడేసరికి యెల్లమ్మోల్ల మేక యాపచెట్టు మొద్దు కింద దాక్కుంది.''

''అయితే...?'' అన్నాను.

''వాన బాగా పడేసరికి సెట్టుకింద మట్టి కరిగి, సెట్టు మేక మీద బడింది సార్... ఇంగ రేత్రి ఎవురికీ తెలీదు. పొద్దున జూసేసరికి సచ్చిపోయి ఉంది'' విజయవంతంగా విషయం చెప్పానన్న సంతృప్తి కనిపించింది వాడి ముఖంలో.

'సెట్టు బలిదీసుకున్నదంట సార్' ఊర్లో జనాల మాటను ఇంకో విద్యార్థి చెప్పాడు.

మా సంభాషణ సాగుతుండగానే ఆచారి నలుగురు మనుషుల్ని వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్ళ చేతుల్లో రంపాలున్నాయి. ఓ పావుగంటకు ఓ మీటర్ పొడవు మొద్దును మొదలు నుంచీ వేరు చేశారు. ఆచారి ఆ మొద్దును నిశితంగా పరిశీలించాడు. అతని ముఖంలో సంతోషం లేదు. కోసిన వాళ్ళకు కూడా చూపాడు. వాళ్ళు కూడా పెదవి విరిచారు.

ఇంతలో రామిరెడ్డి వచ్చాడు. ఆచారి అతనికి కూడా మొద్దును చూపించి, ''రామయ్యా... ఇట్టుంటే ఏం లాభమొస్తది. ఆకారమే గాని గుజ్జు లేకపాయ! పేరుకే వందేళ్ళ చెట్టుగాని శావ జూడు ఎంత మెత్తగ్గా ఉందో... దేనికీ పనికిరాదు'' అన్నాడు దిగులుగా.

రామిరెడ్డి కూడా దాన్ని చూసి బాధపడి ''ఏం సేద్దామంటవ్?'' అన్నాడు.

''ఏం జేత్తవ్.. ఎవురికైన సేతనైతే పొయి పుల్లలు సేసుకోమను. నేల సదరం జేపిచ్చేటప్పుడు పీకి ఏడన్న బారేయ్'' ఆచారి వెళ్ళిపోయాడు. కూలీలు కూడా ఉస్సూరుమంటూ వెనుదిరిగారు.

సాయంత్రం బడి వదిలే సమయానికి జె.సి.బి. వచ్చింది. రామిరెడ్డి ఆ మొద్దును ఎత్తిచ్చి తూర్పు పక్కనున్న పాడుబడ్డ చేదబావిలో వేయించాడు. ఎలాగూ ఆ బావిని పూడ్చేయాలని గ్రామస్తులంతా నిర్ణయించుకున్నారట! ఓ అరగంటకంతా పల్లాన్ని, మెరకను సమం చేసింది జెసిబి.

తర్వాత రోజు ప్రార్థన పూర్తికాగానే హాజరు పట్టీలో సంతకం చేసి బయటికొచ్చాను. ఇంకో ఉపాధ్యాయుడు మల్లిక్‌తో రివటలా ఉన్న వ్యక్తి బడి బయట మాట్లాడుతున్నాడు. పల్లెటూరి వ్యక్తి అయినా చాలా పరిశుభ్రంగా ఉన్నాడు. తెల్లచొక్కా, కాషాయ పంచె కట్టుకొని నెత్తికి తలపాగాతో ఉన్నాడు. తెల్లటి బవిరిగడ్డం, నుదుటన నిలువు నామాలతో భక్తాగ్రేసరుడిలా కనిపించాడు. అతను మల్లిక్‌తో మాట్లాడే మాటలు నాకు బాగా వినిపిస్తున్నాయి.

''ఎంతన్యాయం జేసిండ్రు సార్... పచ్చగుండెనే ... నరుకుతుంటే సదువుకున్నోళ్ళు మీరు ఒక్కళ్ళైనా ఎదురుసెప్పిన్రా! ఇయ్యాల్టిది కాదది... మా అమ్మ చిన్నపిల్లప్పుడు నాటిందంట! ఎండ పొడ తగలకుండ అందరూ సల్లంగ అరుగుమీద కూకుండేటోళ్ళు. సందాలేసుకుని అరుగు కట్టిచ్చినం. ఏం బడికి ఇంకోపక్క చోటు దొరకలేదా? ఎంత అరిట్టం... దాని దెబ్బ ఊరికి గొట్టకపోదు''.

''మేమేం జేసేం వెంగయ్యా. కొట్టేసేటప్పుడు ఊర్లోవాళ్ళు ఒక్కళ్ళైనా వద్దన్నారా?'' మల్లిక్ ఎదురు ప్రశ్నించాడు.

''ఎట్ట చెబుతరయ్యా? నోరున్నోడిదే ఊరు... డబ్బున్నోడిదే న్యాయం. ఊరికి మంచి జేత్తుంటే ఈనాకొడుకుల కెందుకని నాలుగు తిడతరు. వల్లదప్పితే తంతరు కూడా! రామిరెడ్డికి నేను జెప్పి చూసినా... ఇన్లేదు. నాకేం బయం లేదు. తిట్టినా, తన్నినా తప్పు సూపకుంటే నా బతుకెందుకు? పైకె వరూ సెప్పట్లేదు గాని ఊర్లో అందరికీ బో బాదగా ఉంది. ఏం జేత్తం... అంతా కలికాలం... బెమ్మంగారు సెప్పినట్లు పోయేకాలం వచ్చింది. సదుకున్నోళ్ళు మీరు గమ్ముగుండడమే బాలేదయ్యా...''

మెల్లగా గొణుక్కుంటూ అక్కణ్ణించి వెళ్ళాడు వెంగయ్య. అతని మాటలు నాలో అలజడిని రేపాయి. అభద్రతా భావంతో అణిగిమణిగి ఉంటూనే మనసును కల్లోలపరిచిన అంశాలను స్వేచ్ఛగా చెప్పాడు అతను. కానీ నేను.. నోరుండి మూగవాణ్ణయ్యాను. వెంగయ్య స్థాయిలో కూడా నా నిరసనను తెలపలేకపోయాను. వెంగయ్య గొంతు కొన్ని వందల మెదళ్ళలో చెలరేగుతున్న అసహనానికి సూచిక. ఆ గొంతు అందరికీ రావాలి. అకృత్యాలను ప్రశ్నించాలి. నాలాగా పలాయనవాదంతో సమస్యకు పరిష్కారం దొరుకుతుందిలే అన్న ఆత్మవంచనతో కళ్ళు మూసుకోకూడదు.

గళాలు గర్జించాలి. వెంగయ్య నింపిన ప్రేరణ, స్ఫూర్తి నాలో చైతన్యాన్ని మేల్కొలపడమే కాదు, మరికొన్ని గొంతులకు స్ఫూర్తి కమ్మంటోంది. ★